

ఎజెండాలతో ప్రచారం.. ఎవరిదో విజయం?

- సనత్‌నగర్‌లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- మేనిఫెస్టోతో పాటు సొంత ఎజెండాతో ప్రచారం
- వేడెక్కుతున్న రాజకీయం

సనత్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాతో ఉన్నారు. వారికి మద్దతుగా ఆయా పార్టీల పెద్దలు రోడ్‌షోల తో హోరెత్తిస్తున్నారు. అక్కడక్కడ జరిగే ఎన్నికల సభల్లో పాల్గొంటూ కేడర్‌ను ఉత్సాహపరుస్తున్నారు. ఏ రోజుకారోజు ప్రచారంలో ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలన్న కసితో ప్రచార అస్త్రాలకు పదును పెడుతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తాను చేసిన అభివృద్ధి, లబ్ధిదారులకు అందిన సంక్షేమ ఫలాలే తనకు హ్యాట్రిక్‌ను తెచ్చిపెడతాయని గంపెడాశలు పెట్టుకున్నారు. ఇక బీసీ అభ్యర్థికి ముఖ్యమంత్రి పదవి కట్టబెడతామని బీజేపీ ప్రకటించగా అది తనకు కలిసివస్తోందని ఆ పార్టీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. దీనికి తోడు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇబ్బంది కలిగేలా అనాలోచితంగా అభివృద్ధి పనులు చేపట్టారంటూ అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే మరో ప్రధాన పార్టీ కాంగ్రెస్ ప్రజలకు అభయ హస్తం అందిస్తోందని ఆరు గ్యారంటీ పథకాలతో అభ్యర్థి కోట నీలిమ తనదైన శైలిలో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం మీద నియోజకవర్గంలో త్రిముఖ పోటీ తప్పదని తేలిపోయింది. ఈ ముగ్గురు అభ్యర్థులు ఆయా పార్టీల మేనిఫెస్టోతో పాటు నియోజకవర్గానికి సంబంధించి తమ సొంత ఎజెండాను రూపొందించుకుని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

హామీలను మించి చేశాం..ఇంకా చేస్తాం..
తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం పూర్తి చేశాం. హామీలను నెరవేర్చడంతో ప్రజావసరాలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాం. గత పాలకులు పట్టించుకోని దీర్ఘకాలిక సమస్యలను సైతం సవాల్‌గా తీసుకుని శాశ్వతంగా పరిష్కరించాం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తాం. ఏ బస్తీకెళ్లినా అక్కడ అన్ని రకాల వసతులు ఉండాలన్నదే తన అభిమతం. ఆ దిశగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా. ఎస్‌ఎన్‌డీపీతో బేగంపేట నాలా వరద ముంపు సమస్యను తగ్గించడం జరిగింది. పూర్తిస్థాయిలో వరద ముంపు పరిష్కారం జరిగేలా పనులు చేపడతాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అమలుచేస్తాం. డబుల్ బెడ్రూమ్ పంపిణీ నిరంతర ప్రక్రియ. రాని వారు అధైర్యపడొద్దు. కొత్తగా చేపట్టే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అర్హులైన వారికి అందజేస్తాం.

సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కరిస్తా..
మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి



తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతికంగా సలహాలు తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రస్తుతం కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్నారే తప్ప సాంకేతికంగా ఆ పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్ల కన్నా ఎత్తులో వైట్ ట్యాపింగ్ రోడ్లు వేయడంతో వరదనీరంతా అంతర్గత రోడ్లకు చేరి ఇళ్ల నివాసితులు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉంది. సనత్ నగర్ ఆదివారం మార్కెట్‌కు సంబంధించి తాను కోర్టు ఆర్డర్స్‌ను అమలు చేయమనే చెప్పాను తప్ప తరలించవద్దని ఏనాడూ చెప్పలేదు. మార్కెట్‌కు ప్రత్యామ్నాయం స్థలం చూపించి అక్కడికి తరలించాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయి. ప్రత్యామ్నాయం చూపించలేకపోవడం బీఆర్‌ఎస్ పాలకుల వైఫల్యం. పాటిగడ్డలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లు నిర్మించి పదేళ్లైనా లబ్ధిదారులకు కేటాయించలేదు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక అందేలా చేస్తా.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం..
కోట నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి



ఏ బస్తీకెళ్లినా సమస్యలు చెబుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే అన్ని సమస్యలను పరిష్కరించి వాటి రూపురేఖలను మారుస్తా. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నియోజకవర్గంలో అర్హులందరికీ అందేలా చూస్తా. ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు కొంతమందికే అందుతున్నాయి. తాను పార్టీలకతీతంగా అందరికీ అందేలా చేస్తా. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే నా తపన. అందుకోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చి తమ సొంత కాళ్లపై తాము నిలబడేలా చేస్తా. ప్రపంచస్థాయి కమ్యూనిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా. అవినీతిరహిత పాలనను అందిస్తా. ప్రతి పనికి సంబంధించి ఖర్చుల వివరాలను డిస్‌ప్లే చేస్తా. మంచినీటి సరఫరాను మరింత మెరుగుపరిచి ట్రాఫిక్ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతా.

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అవమానించారంటూ ఆందోళన



బన్సీలాల్‌పేట్: బీఆర్‌ఎస్ నేతలు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అవమానించారంటూ సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఐడిహెచ్ కాలనీలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి అడ్డుగా తలసాని శ్రీనివాస్ యాదవ్ కటౌట్‌ను ఏర్పాటు చేశారని మోండా మార్కెట్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద డాక్టర్ నీలిమ, కేరళ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి విశ్వనాథన్, నాగేందర్ రాజ్ ఎలియాస్ రాజప్పతో కలిసి ధర్నాకు దిగారు. సుమారు గంటన్నర పాటు రోడ్డుపై బైఠాయించారు. దీనికి బాధ్యులైన వారిపై వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చర్యలు తీసుకుంటేనే ఇక్కడి నుంచి కదులుతామంటూ హెచ్చరించారు. పోలీసులు ఆందోళన విరమించాలని నీలిమకు నచ్చచెప్పినా ఆమె నిరాకరించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వెంటనే ఈ ఘటనపై కేసు నమోదు చేయాలంటూ గాంధీనగర్ పోలీసులకు సూచించారు. టౌట్ అడ్డుగా పెట్టడంపై కేసు చేయడంతో ఆందోళన విరమించారు.

‘ఆ వీడియో తప్పయితే పోటీ నుంచి తప్పకుంటాం’

కంటోన్మెంట్: లాస్య నందిత డబుల్ బెడ్రూమ్ బాధితుడితో మాట్లాడిన వీడియో తప్పని రుజువు చేస్తే తమ అభ్యర్థి పోటీ నుంచి తప్పుకుంటాడని బోర్డు సభ్యుడు రామకృష్ణ సవాలు విసిరారు. లాల్‌బజార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. కేటీఆర్ తమపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితుడు, లాస్య నందిత మాట్లాడిన వీడియోపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆ వీడియో నిజమేనని తేలితే బీఆర్‌ఎస్ పోటీ నుంచి తప్పుకోవాలన్నారు.



అర్హులందరికీ ‘డబుల్’ ఇళ్లు ఇచ్చితీరుతాం
బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూమ్‌లు ఇచ్చి తీరుతామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. ఎస్‌ఆర్‌నగర్ వేంకటేశ్వర దేవాలయం, ముస్లిం బస్తీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఇంటింట ప్రచారం నిర్వహిస్తూ ప్రజల యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వచ్చే నాయకుల మాటలు నమ్మరాదని నిరంతరం ప్రజల వెంట నడిచే వారికే ఓట్లేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, లలితాచౌహన్, హనుమంత్‌రావు, సంతోష్,నర్సింహ, బలరాం పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి

ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం..

అమీర్‌పేట: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం బల్కంపేట ఏకేగౌడ్ ఫంక్షన్ హాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, అధ్యాపకులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, సుధాకర్, ప్రశాంత్, వెంకట పవన్, ప్రసాద్, అల్తాఫ్ హుస్సేన్, పవన్, సోమసుందర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం..

బన్సీలాల్‌పేట్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావు నగర్, బోయిగూడ, జయప్రకాష్ నగర్, కీస్‌బ్లాక్, బోయిగూడ గండెమ్మ దేవాలయం, ఐడిహెచ్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బోయిగూడ రైల్వే బ్రిడ్జి నుంచి భోలక్‌పూర్ వరకు సీసీ రోడ్డు, మంచినీటి పైపులైన్‌తో పాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.

తలసానికి మద్దతుగా ప్రచారం..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతుగా ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పద్మారావునగర్ ప్రాంతంలో అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

హ్యాట్రిక్ ఖాయం.. మెజారిటీపైనే దృష్టి
బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు


పద్మారావుకు మద్దతు ప్రకటిస్తున్న బస్తీ మహిళలు

చిలకలగూడ: నాయకులు, కార్యకర్తల కృషి, పట్టుదలతో తనకు హ్యాట్రిక్ ఖాయమని మెజారిటీపైనే దృష్టి సారిస్తున్నామని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమతో కలిసి బుధవారం సీతాఫల్‌మండి, ఇందిరానగర్, మేడిబావి, బీదలబస్తీ, సీతారాం నగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు నిరంతరం శ్రమించి ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరుతున్నారన్నారు. అన్నివర్గాల ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీ, అభ్యర్థిగా నాపైన ప్రజాదరణ మరింత పెరిగిందన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ ప్రజా సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిందని, సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు ప్రజల మధ్యే ఉన్నారని, ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీల నాయకులకు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీతారాంనగర్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఉప్పలమ్మ దేవాలయ ఛైర్మన్ కళాప్రకాశ్ పద్మారావుకు ఘనంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్లు సామల హేమ, శైలజ, సునీత, నాయకులు రామేశ్వర్, కిరణ్, కరాటే రాజు, సుంకు రాంచందర్, కళాప్రకాశ్, ఆలకుంట హరి, సంగీత్, సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల మద్దతు..

బౌద్ధనగర్ గంగపుత్ర, గ్రేటర్ హైదరాబాద్ విశ్వబ్రాహ్మణ సంఘాలు, గ్రేటర్ హైదరాబాద్ మాల జేఏసీ, వీర క్షత్రీయ కుల సంఘాలు పద్మారావుకు మద్దతు ప్రకటించాయి. పద్మారావు గెలుపు ఖాయమైందని, అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉత్తమ్‌సుమన్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు అశోక్‌చారి, విష్ణుచారి, మల్లారి అనీల్‌కుమార్, రాములు, సునీల్, రాజేష్, శ్రీను, రాంచందర్ పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి

అడ్డగుట్ట: సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ తుకారాంగేట్‌లోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సాయినగర్, కొండారెడ్డి నగర్, గడ్డమీది బస్తీ, గోల్‌బావి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఇంటి పార్టీగా చూస్తున్నారని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత పద్మారావుగౌడ్‌కే దక్కుతుందన్నారు. ప్రచారంలో లింగాని శ్రీనివాస్, విజయకుమారి, శ్రీనివాస్‌గౌడ్, నక్క మధు, సత్తయ్య, మనోహర్, మహ్మద్, పొన్నాల రాజు, అమర్, వసంత, గౌస్, మహేశ్వరి, మోహన్ పాల్గొన్నారు.


కళాప్రకాశ్ ఆధ్వర్యంలో పద్మారావుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి


ప్రచారం చేస్తున్న సారంగపాణి

లాలాపేట: తెలంగాణలో కొనసాగుతున్న కల్వకుంట్ల కుటుంబ పాలనకు ఈ ఎన్నికల్లో చరమగీతం పాడి బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు తేవడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని సికింద్రాబాద్ ఆ పార్టీ అభ్యర్థి మేకల సారంగపాణి అన్నారు. బుధవారం ఆయన తార్నాకలో మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ప్రజా వ్యతిరేఖ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. మైనార్టీలు, దళితులు అన్ని వర్గాల ప్రజల నుంచి బీజేపీకి మద్దతు లభిస్తుందన్నారు. రాష్ట్రంతో పాటు సికింద్రాబాద్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో రాము వర్మ, వేణుయాదవ్, వెంకటేష్‌గౌడ్, పోచయ్య యాదవ్, సుబ్బారావు, ప్రకాష్‌గౌడ్, వీరన్న, అనిత, శ్రీనివాసచారి, గండికోట నర్సింహా పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో నీలిమ

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించాలి
కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ


పద్మారావునగర్‌లో ప్రచారం చేస్తున్న నీలిమ

పద్మారావునగర్: సనత్‌నగర్ నియోజకవర్గంలో మార్పు కోసం కాంగ్రెస్ రావాలని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్, హమాల్‌బస్తీ, సాయిబాబా దేవాలయం ఏరియా తదితర ప్రాంతాల్లో బుధవారం ఆమె ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. సనత్‌నగర్ సమగ్రాభివృద్ధికి ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆసరా కింద ప్రతి నెలా రూ. 4,000 పింఛన్, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఇంటి స్థలం ఉన్న వారికి రూ. 5 లక్షలు, మహాలక్ష్మీ కింద మహిళలకు రూ. 2,500, గృహజ్యోతి ద్వారా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తుందన్నారు. పేదల వికాసం, అభివృద్ధికి కాంగ్రెస్ అభయహస్తం ఇస్తుందన్నారు. పాదయాత్ర సందర్భంగా ప్రజలు అనేక సమస్యలు ఏకరువు పెడుతున్నారని బీఆర్‌ఎస్ పాలనలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓ సారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతి, అహంకార ప్రభుత్వాన్ని గద్దె దించాలి..

సనత్‌నగర్: అవినీతి, అహంకార ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజలు ఆలోచించి అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేసే కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని సనత్‌నగర్ అభ్యర్థి కోట నీలిమ అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి వెంకటేష్‌యాదవ్‌తో పాటు మరికొంతమంది నాయకులు బుధవారం కాంగ్రెస్ చేరగా వారికి ఆమె పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలంటే హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అది కాంగ్రెస్ అధికారంతోనే సాధ్యపడుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందగోపాల్, వెంకటేష్‌రెడ్డి, గోపాలకృష్ణయాదవ్, సతీష్‌కుమార్, లక్ష్మీ, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

సనత్‌నగర్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి


ఎన్నికల ప్రచారం చేస్తున్న మర్రి శశిధర్ రెడ్డి

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారం.. సనత్ నగర్ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అవినీతి, ప్రజా కంటక బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పాదయాత్ర సందర్భంగా ప్రజలు అనేక సమస్యలను ఏకరువు పెడుతున్నారని చెప్పారు. కల్వకుంట్ల కుటుంబ పాలనతో రాష్ట్రం అధోగతి పాలయిందన్నారు. అరచేతిలో స్వర్గం చూపుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని చెప్పారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి, నీతి నిజాయితీ గల బీజేపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. అంతకు ముందు మర్రి శశిధర్‌రెడ్డి ఇంటింటి పాదయాత్ర నిర్వహిస్తూ రానున్న ఎన్నికల్లో ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు.



సందడిగా క్రిస్మస్ ఫ్రూట్ మిక్సింగ్ వేడుక



సనత్‌నగర్: బేగంపేటలోని శ్రీశక్తి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం క్రిస్మస్ ఫ్రూట్ మిక్సింగ్ వేడుక ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా వివిధ రకాల ఎండు ఫలాలను పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, మద్యంతో కలిపి నిల్వ ఉంచారు. నగరంలోని ప్రముఖ హోటల్స్‌కు చెందిన మేనేజర్లు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, జూనియర్ కళాశాలలకు చెందిన ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని ఫ్రూట్ మిక్సింగ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపింజల, డైరెక్టర్ యమునా రంగారావు, మార్కెటింగ్ డైరెక్టర్ రవి పింజల, ఫిలిం ప్రొడ్యూసర్ నీలిమ గుణ, ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.


శీలం ప్రభాకర్‌కు మంత్రి నివాళి

రాంగోపాల్‌పేట్: మాజీ కార్పొరేటర్, టీపీసీసీ కార్యదర్శి శీలం ప్రభాకర్‌కు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. శీలం ప్రభాకర్ సంస్మరణ సభ బుధవారం ఎంజీరోడ్డులోని మున్నూరు కాపు సంఘం హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి, కోట నీలిమ వేర్వేరుగా వచ్చి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీపతి సతీష్‌కుమార్, ఎం రాజు, పిల్లి శ్రీనివాస్‌రావు, చీర శ్రీకాంత్, సతీష్, చామకూర సుజాత, ఆదం సంతోష్, ఆదం విజయ్‌కుమార్, కరాటే రాజు, మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఓటడిగిన బీజేపీ అభ్యర్థి

సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి, సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డిప్యూటీ స్పీకర్ పద్మారావును కలిసి ఓట్లు అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం టకారాబస్తీలో మర్రి శశిధర్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతంలో ఉండే పద్మారావు గౌడ్ ఇంటికి వెళ్లారు. ఇద్దరు ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీ ఓటు బీజేపీకి వేయాలంటూ మర్రి శశిధర్‌రెడ్డి ఆయనకు కరపత్రాన్ని అందించారు.

–బన్సీలాల్‌పేట్



కంప్యూటర్ నెట్‌వర్క్ ఆధారంగా కాలుష్య పర్యవేక్షణ

సనత్‌నగర్: కంప్యూటర్ నెట్‌వర్క్ ఆధారంగా కాలుష్యాన్ని ఏ విధంగా గుర్తించొచ్చు అనే అంశంపై కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా అంతకంతకూ పెరిగిపోతున్న వాయు, జల, భూమి, ధ్వని కాలుష్యాన్ని కంప్యూటర్ నెట్‌వర్క్‌తో పర్యవేక్షించి తదనుగుణంగా నియంత్రణ చర్యలపై పీసీబీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఆ రంగంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులతో సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నకుమార్ సమావేశమయ్యారు. వాయు కాలుష్యాన్ని ట్రాక్ చేయడం, ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లకు సెన్సార్ల ద్వారా సమాచారాన్ని ఏవిధంగా గ్రహించవచ్చో అనే అంశంపై చర్చించారు. అలాగే ప్లాస్టిక్ రీసైక్లింగ్ కోసం రూపొందించిన యాప్ పనితీరును వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కొనియాడారు. విద్యార్థులు చరణి, సోహెన్, దుర్గాదేవి, కల్పన, స్నేహ పాల్గొన్నారు.

వెన్నెల గెలుపుతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

కంటోన్మెంట్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు పేదల పాలిట వరాలని కర్నాటక రాష్ట్రం చిక్‌మగ్‌లూరు ఎమ్మెల్యే నయన అన్నారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వెన్నెలతో కలిసి బుధవారం మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్నాటక రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు గ్యారంటీలు అమలు చేస్తున్నామని అదే విధంగా తెలంగాణలోనూ కచ్చితంగా అమలు చేస్తామన్నారు. నిస్వార్థ ప్రజాసేవకుడు, దివంగత గద్దర్ కుమార్తె వెన్నెలను గెలిపిస్తే కంటోన్మెంట్‌లో అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. మోండా డివిజన్ పీసీసీ జనరల్ సెక్రెటరీ బొల్లు కిషన్ గౌరీ శంకర్, బాబు ముదిరాజ్, నందికంటి రవి, రషీద్, బద్రీనాథ్ పాల్గొన్నారు.


వెన్నెలకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నయన

సీపీఐ మద్దతు..

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సీపీఐ పార్టీ, అనుబంధ కార్మిక విభాగం ఏఐటీయూసీ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ తెలిపారు. బుధవారం ఏఐటీయూసీ సీనియర్ నాయకులు బోస్ బాబుతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వెన్నెలను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. కార్మికులు, ప్రజలకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థులను ఓడించడం ద్వారా కార్మిక వర్గం తమ హక్కులను సాధించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజమౌళి, బోయిన్‌పల్లి మార్కెట్ హమాలీ యూనియన్ నాయకులు ఎల్లయ్య, కొమురయ్య, గట్టయ్య, సమ్మయ్య, రాజు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


పార్కులో సీనియర్ సిటిజన్లతో మాట్లాడుతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బీజేపీని గెలిపిస్తే అన్ని కాలనీల్లోని పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ అన్నారు. మారేడుపల్లి నెహ్రూనగర్ పార్కులో స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో వందలాది పార్కులు నిర్వహణ లోపం వల్ల సద్వినియోగం చేసుకోలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం, కాలనీ సంక్షేమ సంఘాల సమన్వయంతో అన్ని పార్కులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కంటోన్మెంట్‌లో బీజేపీ గెలిస్తే కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి కొనసాగుతుందన్నారు.